# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు కేంద్ర బృందం ఈ రోజు విజయవాడలో పర్యటిస్తోంది.**
2. **వరద ప్రవాహం తగ్గు ముఖం పడుతున్న దృష్ట్యా వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ సి.హరికిరణ్ తెలిపారు.**
3. **వరద ఉధృతి తగ్గడంతో విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ప్రభుత్వం నిర్వహిస్తోంది.**
4. **వరద బాధిత కుటుంబాలకు ప్రణాళికాబద్ధంగా ఆహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు.**
5. **జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా పలువురు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు.**

==========================

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా సంభవించిన నష్టాన్ని అంచనావేసేందుకు కేంద్ర హోం శాఖ అదనపు కార్యదర్శి సంజీవ్ కుమార్ జిందాల్ నేతృత్వంలోని బృందం ఈ రోజు విజయవాడలో పర్యటిస్తోంది. పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజీని పరిశీలించారు. అనంతరం అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ సంస్థ ప్రధాన కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. వరదల కారణంగా రాష్ట్రంలో సంభవించిన నష్టాన్ని అధికారులు కేంద్ర బృందానికి వివరించారు. సమీక్ష అనంతరం విజయవాడలోని ముంపు ప్రాంతంలో నష్టాన్ని పరిశీలించడంతో పాటు వరద బాధితులతో మాట్లాడి పరిస్థితులను కేంద్ర బృందం అడిగి తెలుసుకోనుంది.

--------------------------

విజయవాడ నగరంలో వరద ప్రవాహం తగ్గు ముఖం పడుతున్న దృష్ట్యా సంక్రమిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ సి.హరికిరణ్ తెలిపారు. విజయవాడలో 32 డివిజన్లలో ఈరోజు నుంచి ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామనన్నారు. ఈ వైద్య శిబిరాలలో రోగులకు అవసరమయ్యే వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందుల్ని అందిస్తారని తెలిపారు. వరద ప్రభావిత గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వైద్య సేవలను అందిస్తున్నామని తెలిపారు. అత్యవసర ఆరోగ్య సేవలను అందించేందుకు అనేక కార్యక్రమాల్ని వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిందన్నారు. 32 వార్డుల్లో అందరికీ 6 రకాల అత్యవసర మందుల కిట్లను, వాడే విధానాన్ని వివరించే కరపత్రాల్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

--------------------------

వరద ఉధృతి తగ్గడంతో  విజయవాడ నగరంలోని పలు కాలనీలో వరద ప్రవాహం తగ్గుతోంది.  వరద తగ్గుముఖం పట్టడంతో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను అధికారులు  ప్రారంభించారు. రాష్ట్రంలోని 25 నగర, పురపాలక సంస్థల నుంచి వచ్చిన 4 వేల 500 మంది పారిశుద్ధ్య కార్మికులకు విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో విధులు కేటాయించారు. వరద పూర్తిగా తగ్గి, బురద, ఇసుక, చెత్త పేరుకుపోయిన భవానీపురం, రామకృష్ణాపురం, అయోధ్యనగర్, సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో పనులు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మట్టి, బురదని తొలగిస్తున్నారు. ఇలా ఉండగా విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో వార్డుకో ప్రత్యేకాధికారిగా 29 మంది ఐఏఎస్ అధికారులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్  ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అధికారులు  సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, వరద బాధితులకు  ప్రభుత్వ సేవలందేలా చర్యలు తీసుకుంటారని నీరబ్ కుమార్ ప్రసాద్ తెలిపారు.

--------------------------

వరద బాధిత కుటుంబాలకు ప్రణాళికాబద్ధంగా ఆహారాన్ని అందిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్  జి.సృజన తెలిపారు. విజయవాడలోని  ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలోని  కేంద్రీకృత నిల్వ కేంద్రాన్ని కలెక్టర్ ఈ ఉదయం పరిశీలించారు. అనంతరం ఆమె  పాత్రికేయులతో మాట్లాడుతూ, నిల్వ కేంద్రం నుంచి ప్రతి ఇంటికి ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు వంటివి అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆహారాన్ని రవాణా చేసేందుకు వచ్చే వాహనాలకు ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే  ప్రత్యేక భద్రతా సిబ్బంది సహాయంతో వాహనాలను వరద ముంపు ప్రభావిత ప్రాంతాలకు సరైన సమయంలో చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్  తెలిపారు.

--------------------------

భద్రాచలం వద్ద గోదావరికి వరద ఉధృతి కొనసాగుతుండటంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద  గోదావరి వరద ప్రవాహం పెరిగింది. ధవళేశ్వరం వద్ద ప్రస్తుత నీటిమట్టం 11 అడుగులుగా నమోదైందని అధికారులు తెలిపారు. సముద్రంలోకి 8.80 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. వరద ప్రవాహం పెరుగుతున్నందున  లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని కలెక్టర్ సూచించారు.

--------------------------

భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈరోజు దేశ వ్యాప్తంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సామాజిక మాధ్యమాలు వేదికగా నివాళులర్పించారు. అధ్యాపకవృత్తికి వన్నె తెచ్చిన వారు సర్వేపల్లి రాధాకృష్ణన్ అని వారు కొనియాడారు. యువత భవిష్యత్‌ను నిర్దేశించే వారిలో అధ్యాపకుల పాత్ర కీలకమని అటువంటి ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు ఉపాధ్యాయ దినోత్సవ  శుభాకాంక్షలు తెలిపారు. కాగా.. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురు పూజోత్సవాన్ని నిర్వహించారు.

--------------------------

విజయవాడలోని బుడమేరుకు మళ్ళీ వరద వస్తున్నది అంటూ ప్రచారమవుతున్న వదంతులను నమ్మవద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన ఓ ప్రకటనలో సూచించారు. ప్రస్తుతం బుడమేరులో ప్రమాదకర స్థాయిలో నీరు లేదని, మరోపక్క కృష్ణా నదిలోనూ వరద తీవ్రత తగ్గినట్టు తెలిపారు. ప్రకాశం బ్యారేజీ వద్ద నిన్న రాత్రి 3 లక్షల 8 వేల 83 క్యూసెక్కుల మేర ప్రవాహం ఉన్నట్టు పేర్కొన్నారు. బుడమేరు మళ్లింపు కాల్వలో 5 వేల 83 క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉందన్నారు. ప్రమాదకర పరిస్థితి తలెత్తితే, ప్రజలకు ముందే సమాచారమిచ్చి, అప్రమత్తం చేస్తామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

---------------------------

పౌష్టికాహారంతో పిల్లల్లో రక్తహీనత తగ్గుతుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. నరసరావుపేటలోని శంకర భారతి పురం జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవం కార్యక్రమంలో నిన్న కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం పై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 1వ తేది నుండి 30వ తేది వరకు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో భాగంగా రక్త హీనత పై అవగాహన కల్పించడం, రక్త పరీక్షలు నిర్వహించి రక్తహీనత నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదును నిర్వహిస్తున్నామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి తెలిపారు. నిన్న విశాఖపట్నంలో బిజెపి కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 2వ తేదీ నుంచి 20వ తేది వరకు బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పార్టీ తొలి సభ్యత్వాన్ని నమోదు చేసుకోవడం ద్వారా ఈ ప్రక్రియను ప్రారంభించారని తెలిపారు.

---------------------------

మరోవైపు వరద ప్రభావిత ప్రాంతాల్లో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని తాగొద్దని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. విజయవాడలోని 32 డివిజన్లతో పాటు సమీప 5 గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని 200 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అజిత్‌సింగ్ నగర్‌లో ఆర్టీసీ ఉచిత బస్సులు అందుబాటులో ఉంచామని ఇక్కడి నుంచి విజయవాడలోని పలు ప్రాంతాలకు 6 బస్సులు వెళ్తున్నాయని ధ్యానచంద్ర తెలిపారు.

---------------------------

తిరుపతి రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తిరుపతి పార్లమెంటు సభ్యులు ఎం. గురుమూర్తి అన్నారు. తిరుపతి రైల్వేస్టేషన్ లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన ఈరోజు రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 300 కోట్ల రూపాయలతో తిరుపతి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే రేణిగుంట రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనుల కోసం 200 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని.. ఆ పనులు కూడా త్వరలో ప్రారంభమవుతాయని గురుమూర్తి పేర్కొన్నారు.

---------------------------

చిత్తూరు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ దేవస్థానం కార్యనిర్వహణాధికారి పి.గురుప్రసాద్ తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఈరోజు ఆయన పాత్రికేయలతో మాట్లాడుతూ, సెప్టెంబర్ 7వ తేదీ శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమై 21 రోజులపాటు జరుగుతాయని తెలిపారు. భక్తులందరూ పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నందున రద్దీకి తగ్గట్టు ఏర్పాట్లు చేశామన్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 450 మంది సిబ్బందితో భద్రత ఏర్పాట్లు చేశామని గురుప్రసాద్ వివరించారు.

---------------------------

ప్రార్థించే పెదవులకన్నా సాయం చేసే చేతులు మిన్న అనే తన మాటను అమలులో చూపించిన.. నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మదర్ థెరిస్సా వర్థంతి ఈరోజు. ప్రస్తుత మాసిడోనియాలో 1910 ఆగస్టు 26వ తేదీన జన్మించిన ఆమె భారత్ కు వచ్చి కలకత్తాలో కుష్టు రోగులకు సేవ చేశారు. ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన వనితగా గుర్తింపు పొందిన ఆమె... 1997 సెప్టెంబర్ ఐదో తేదీన కలకత్తాలో తుదిశ్వాస విడిచారు.

======================